# ప్రతిమ

ఊహా నాటిక

నేతేటి వాయునందనశర్మ.
ఘండికోట బ్రహ్మాజీరావు.

అశోక మహాచక్రవర్తి చంద్రకాంతశిలావేదికయందు పూసెజ్జ మీద నిదురిస్తున్నాడు పున్నమి వెన్నెలలు వెల్లివిరిసిపోతున్నాయి ఉద్యానవనం శాంతంగా వుంది.

(తిష్యరక్షిత ప్రవేశిస్తుంది)

తిష్యరక్షిత — (అశోకుని శిలావేదికను సమీపించి) ఆర్యపుత్రులు నిదురిస్తున్నారు పండువెన్నెలలో ఈయన ఎంత అందంగా కనిపిస్తున్నారు (అశోకుని సమీపించింది) అబ్బ! ఈ ముఖంలో ఎంత చక్కదనం ఉంది (అశోకుని ముఖం మీద ముఖముంచింది) నా దేహము పులకిస్తున్నది ఈ సౌందర్యతాశిక్కిలోబడని స్త్రీలు ఎవరున్నారు? (మెల్లగా అధరచుంబనం చేసింది) (మధుమాసకోయిల 'కుహూ' అని కూసింది) కోకిలా! నేనుండేటప్పుడా కూస్తావు? ప్రభువు లేచి, చుంబించబోయే నన్నుచూస్తే నీకు సంతోషంగా వుంటుందా? సిగ్గులేనిదానా! ఆడిపోశానని కోపంతో మళ్ళా కూశావేమో! ప్రభువు మేలుకుంటే కొన్ని రాజ కార్యాలు ఆగిపోతాయి ఓ వసంతశోభా! నన్ను కొంత సేపు ఏమరచి ప్రభువుసేవ చేయ్

(చేటి ప్రవేశిస్తుంది)

చేటి —(దూరంనుండి) అమ్మా! అమాత్యులు ఆలోచనామందిరంలో వేచి ఉన్నారు తమకోసం నిరీక్షిస్తున్నారు

తిష్య —పద.

(చేటి వెళ్ళిపోయింది మహారాణి అశోకుని లలాటాన్ని లలితంగా చుంబించింది త్వరగా మరలి అడుగులు వేస్తున్నది గాలికెగిరే చీరచెరగు త్రోవపక్కనున్న ప్రతిమకుతగిలి గమన్నానికి కొంచెం ఆటంకం కలిగించింది)

తిష్య —(ఆగి!) ఎవరది (వెనుదిరిగి, ప్రతిమను నిదానించి చూచి) ఎవరది? (ఒకక్షణం తీక్ష్ణంగా చూచి, చిన్నవవ్వు నవ్వుకుని) ఎంతగా భ్రమించాను ఆచార్య సోమదత్తుడు నిర్జీవ ప్రతిమను తయారుచేసి, సజీవను నన్ను నిర్జీవగా చేసి వేశాడు. ఈమె నిజమైన స్త్రీ అయితే నాకీ అంతఃపురంలో చోటెక్కడ పురుషులు చలచిత్తులు, కామాంధులు .. ఈ స్త్రీప్రతిమనుకూడా తీసి దాచివేయవలసిందే (వెకిలిగా నవ్వి) సహజంగా ఆర్యపుత్రులు చలించరు ఐనా నా జాగ్రత్తలో నేనుండడం మంచిది

చేటి —(దూరంనుండి) అమ్మా! త్వరపడండి

తిష్య.—పద (వెళ్ళిపోయింది)

(తిశ్యరక్షిత పరోక్షంలో వెన్నెల హెచ్చయింది మధుమాస శ్రీలు ఉద్యానవనశోభకు మెరుగుదిద్దాయి అశోకుని శయ్యకు అనతిదూరంలోనే ఉన్న చంద్రకాంత శిలానిర్మితమైన ప్రతిమ చేతిలోని ఏకతారతంత్రులు మరుదంకుర స్పర్శానుభవంవల్ల ధ్వనించాయి ప్రతిమను లేతశరీరంలో చంద్రికలు తమ అందాలు చూచుకొంటున్నాయి. పుష్పాలు వికసించాయి కోయిలలు మేలుకొన్నాయి

తంత్రులు —(గాలికి కదలి శబ్దించాయి) .ప్రభూ!

అశోకుడు —(కొంచెం కదిలాడు)

తంత్రులు.—ప్ర భు ఊ (పుష్పసౌరభంవచ్చి మధురతంత్రీ స్వనంతో మేళవించింది )

అశోకుడు —(కళ్ళిప్పి! వచ్చేసౌరభాన్ని ఆఘ్రాణించి) ఎవరది? ఇంత చక్కగా పరిమళం పంపి పిలుస్తున్నారు (కొంచెం ఆగి) తిష్యరక్షిత లేదుకద (చుట్టూ చూచి) ఆమె వచ్చిందంటే ఈ వనం ఇలా ఉంటుందా? పుష్పాలు ముడుచుకొని, కోయిలలు గొంతులు మూసుకొని: • గాలి చలనం మానుకొని, సహజత్వంకూడా పోగొట్టుకుంటాయే

తంత్రులు: —(మళ్లా) ప్ర భూ!

అశో —ఇంత హాయిగా నన్ను పలుకరించేవారెవరు? తిష్యరక్షిత లేదన్న సంగతి ధ్రువమే

(చందమామ నడినెత్తిమీదకు వచ్చాడు-ప్రతిమ జ్యోత్స్నా సుధాస్నాతయై చలించింది)

అశో —(ఆ దిక్కుచూచి, సంకోచిస్తూ) ఎవరు?

తంత్రులు:—(తారకంలో) ప్ర భూ!

కోకిల:—కుహూ! కుహూ!

అశో —(శయ్యనుంచిలేచి, రెండడుగులువేసి, జీరాడే ఉత్తరీయాన్ని పైనవేసుకొని) ఎవరు?

ప్రతిమ.—(కొంచం కదిలి) ప్రభూ!

అశో.—(సమీపించి, తేరిపారచూచి) నీవెవరు?

ప్రతిమ.—(లజ్జతో తలవంచి) మీ చరణదాసిని అనుదినం మీ పాదధూళిలో ఉండేదానిని

అశో.—(ఇంకా దగ్గరకు వచ్చి) నాకేం అర్థంకాలేదు నీవెవరు?

ప్రతిమ —(మెల్లిగా) ఆచార్య సోమదత్తుని పుత్రికను

అశో —మహాశిల్పికి పుత్రికలు లేరే

ప్రతిమః—లేకేమి? అతని సృష్టిని నేను . నిరుపమను పుత్రికను కానా?

అశో —(ఆలోచించి) ఎవరూ! నిరుపమవా? ఆ! ఆ! జ్ఞాపకం వస్తున్నది మహాశిల్పి దయతో సమర్పించిన చంద్రకాంతశిలాప్రతిమవు నిరుపమవు నువ్వేనా? . ప్రతిమవు . . (సంకోచించాడు) ఈ మధురసంభాషణం ఎక్కడనుంచి వచ్చినవి?

ప్రతిమః—నేటి వసంతశోభ నాకు జీవాన్ని పోసింది

అశోః—మహాశిల్పి నిర్మాణంలో జీవం గోచరిస్తుంది గాని నేడది నిజత్వం దాల్చింది ఎంత సుదినం

ప్రతిమ —(చిరునగవుతో తలవంచింది)

అశో —(ప్రతిమ శరీరాన్ని స్పృశించి) అబ్బ! కుసుమసుకుమారంగా ఉందే! చంద్రకాంతశిలానిర్మితవై, దూరానికి అందంగా ఉన్నా, తాకేసరికి మహాకఠినత్వం వహించి ఎంత కాలంనుండి ఈ పాంచాలికారూపంతో ఉన్నావో ? పోనీ! నేటికి స్త్రీవై సాధారణస్త్రీవా అప్సరసవై సజీవంగా కనుపించావు విరుపమా! నీవు సౌందర్యాధిదేవతవు

ప్రతిమ.—(లజ్జాకంపితయై) ప్రభూ! ధన్యురాలినయాను నా జన్మ తరించింది

అశో —నిరుపమా (ఆమె కళ్ళలోకి చూస్తూ) నీవు ప్రతిమవు కావు ప్రతిమకు చలించే కనుపాపలుంటాయా! అనురాగ వీక్షణాలుబరపే నేర్పుంటుందా? ఎంత చక్కనిదానవు?. ..

ప్రతిమ —(నవ్వుతూ ఊరుకుంది తంత్రులు సన్నటి శబ్దం చేస్తున్నాయి)

అశో —నిరుపమా ! రా ఇలా పులకించే వెన్నెలలో విహరిద్దాము

ప్రతిమః—ప్రభూ! క్షమించండి. తిష్యరక్షితాదేవికి నేను కదిలానని తెలిస్తే, నా జీవితం ముగిసిపోతుంది .. మీ పాదధూళియేనా లభించకుండా పోతుంది నన్నిక్కడే ఉండనీయండి.

అశో —ఎవరిక్కడికి వస్తారు ? ఎవరు చూచి మహారాణితో చెప్తారు ? నీభయంతప్ప మరేం లేదు.

ప్రతిమ —లేదు ప్రభూ! ఇప్పుడే మహారాణి తిష్యరక్షితాదేవి వచ్చి వెళ్ళారు. మీరు నిదురిస్తున్నారు అప్పుడు.

అశో.—నిద్రిస్తున్నాను గాని ఆమె వచ్చినసంగతి తెలియదు. ఒకసారివచ్చివెళ్ళిందా, మరి మళ్లా రావడానికి ఆమెకు అవకాశం ఉండదు భర్తకన్న, భర్తృవ్యవహారాలమీద ఆమెకు అభిమానం హెచ్చు. మరిరాదులే.

ప్రతిమ.—ప్రభూ! నన్నుమాత్రం కదిపారంటే తిరిగి ఈచోటికి రాలేనేమో !

అశో —పిచ్చిపిల్లా ఇంకాభయమే !

ప్రతిమ —భయంలేదు నా స్థానభ్రంశం మీకు హానిచేయదుకదా!

అశో.—నాగురించా భయపడుతున్నావు?

ప్రతిమ —నాగురించి నాకు భయమేలేదు మీగురించే—

అశో.—నీకా సంశయం వద్దు నిరుపమా కదలిరా.

ప్రతిమ —(అశోకుని ముఖంలోకి చూస్తూ నిలబడింది.)

అశో.—ఆమెను స్వయంగా బాహువులలోకి ఎత్తుకొని, పుష్పశయ్యకు తీసుకొనిపోయాడు.)

ప్రతిమ —ప్రభూ! ఈ పూజాకుసుమం ప్రభువుపాదాల సామీప్యం చెంది తరించింది. ఆ మహావకాశం ఈ అల్పజీవికి లభిస్తుంది, ఇంతవేగిరం, అని ఏనాడూ అనుకోలేదు

అశోః—నిరుపమా! కొంచెంసేపు నీ ఏ కతారమీదపాడు.

ప్రతిమ —ఈ మహానిశ్శబ్దాన్ని చీల్చుకొని, నాపాట తిష్యరక్షితాదేవి చెవులలోపడితే ప్రకృతి ప్రళయంలో మునిగిపోదా?

అశో —ఇంకా ఆమెభయమే

ప్రతిమ —ఆమెవలన నాకు భయంలేదు నా జన్మతరించింది .. నాకామె భయంలేదు

అశో — మరెందుకా సంకోచం

ప్రతిమ —ఆమెవలన మీకేమేనా కలుగుతుందేమోనని భయపడ్డాను మీరు మహాచక్రవర్తులు మీకు భయంకలుగకూడదు నాసంకుచిత స్త్రీబుద్ధితో యోచించాను ప్రభూ ! క్షమించండి. మీకు హాని కలుగుతుందని నాభయంతప్ప . నిజంగా మీకులేదు. కలుగనూ కలుగదు.

అశో —(ఆమె కపోలాలు మెల్లగాస్పృశించి) ఎంత అబలవు ! నిరుపమా ! బంధూక కాంతిని పరిహసింపజేసే నీమధురాధరం చుంబించనీ, నీ దివ్యగానం నాచెవులారా విననీ

(ప్రతిమ శయ్యమీదకూచొని, ఏకతారమీటుతూ పాడ మొదలిడింది. మలయానిలం పూవు పూవు దగ్గిర పరిమళం దొంగిలించి అంతటా పంచిపెడుతున్నది పుట్టినిల్లయిన క్షీరోదధినుండితెచ్చిన మీగడలే చందమామ రాలుస్తున్నాడు)

ప్రతిమ — (పాటను ఆపి) ప్రభూ ! (అర్ధనిమీలితనయనాలతో అశోకుని సాకాంక్షగా చూచింది.)

అశో — (ప్రతిమను అతిగాఢంగా కౌగిలించుకున్నాడు) ఓ అప్సరో సుందరీ! ఈ అల్పుడికోసం ఏ దేవలోకం త్యజించావు.

ప్రతిమ — ప్రభూ! నేను మానవనిర్మితనే!

అశో — మర్త్యుల కీనైపుణ్యంలేదు నీవు అమరలోక వాసినివి (ప్రతిమను గాఢాశ్లేషబద్ధనుగాచేసి చుంబిస్తున్నాడు ప్రతిమ ఆనందతన్మయ పరిసరాలు చంద్రికా సుధాస్నాతాలు కాలంకూడా జరుగకుండా నిశ్శబ్దత వహించిందేమో.)

ప్రతిమ.— (వినుట అభినయించి) ప్రభూ! మంజీరధ్వని

(ధ్వని మెల్ల మెల్లగా హెచ్చవుతున్నది )

అశో — (ప్రతిమ మాటలు వినడంలేదు. మాట్లాడడానికి అవకాశం ఈయకుండా ఇంకా ఇంకా ఆమెపెదవులు చుంబిస్తున్నాడు)

ప్రతిమ — (అశోకుని మెల్లగా అపవారించి) ప్రభూ! మహారాణి వస్తున్నది ఆమె మంజీరధ్వనికి నాచెవులు చాలా పాత బడ్డాయి.

అశో — పిచ్చిపిల్లా మహారాణి మరిరాదు (ప్రతిమ దేహాన్ని ఆక్రమించుకొంటున్నాడు ధ్వని సమీపించింది )

ప్రతిమ — ప్రభూ!

అశో — (మాట్లాడడంలేదు )

ప్రతిమ — (మెల్లగా) ప్రభూ! నా జన్మ తరించింది దాసిని మరచి పోకండి

(ధ్వని ఆగిపోయింది దూరమునుండి తిష్యరక్షిత మాట్లాడుతుంది.)

తిష్య — (దూరమునుండి) ఇక్కడి పాలరాతి బొమ్మను ఎవరు కదిపారు?

ప్రతిమ — (చైతన్యంలేదు )

అశో — (తన్మయతలోంచి మేలుకొన్నాడు) ఏమిది ? నిరుపమా ఇదేమి? నీ తనువు ఇలా పాషాణప్రాయమై పోయిందేమి? (ఆమెను పరిశీలించి) ఏమిటిది? నిర్జీవ ప్రతిమవై పోయావా ? నిరుపమా ! తిష్యరక్షిత రాకతో శిలాకఠినత్వం వహించావా?

తిష్యరక్షిత — (సమీపించింది నిదానించిచూచి) ఎవరిది ? ఆర్యపుత్రులు ఎవరినిలామన్నించి మాట్లాడుతున్నారు ? (వేదికను ఎక్కింది) ఈ రాతిబొమ్మ ఈ పుష్పశయ్యపై వుందేమి.

అశో — (వినిపించుకోకుండా) నిరుపమా ! నీ సుమమార్దవం ఏమయిపోయింది ?

తిష్య — ఆర్యపుత్రుల కీ మతిభ్రమ ఎప్పుడు వచ్చింది ?

అశో — ఇప్పుడే నీ మంజీరధ్వని విన్నదగ్గిరనుండే

తిష్య — పురుషులకు వివేకం లేదు భార్యాపరోక్షంలో, అన్యస్త్రీ దొరక్కపోయినా, జీవంలేని ఆడుబొమ్మనైనా కౌగిలించు కొంటారు.... ఛీ !

అశో.— (మౌనంగా ఆమెపైపు చూస్తున్నాడు)

తిష్య— (గట్టిగా) ఎవరక్కడ

దాసి.— (ప్రవేశించి) మహారాణీ ! ఆజ్ఞ.

తిష్య — ఈ రాతిబొమ్మను పగులగొట్టి, సందిచేసి, సముద్రంలో కలిపిరండి.

అశో — (మెల్లగా) దేవి! ఈ ప్రతిమను మరి ఎప్పుడూ తాకను. భగ్నంచేసే యత్నం మానుకో !

తిష్య — (వెకిలిగానవ్వుతూ) ప్రభూ ! మీకు ఇష్టమైనపని నాకు కత్తికోత.

(భటులువచ్చారు. ప్రతిమను తీసుకొనిపోయారు )

అశో — ఓ కాలసర్పిణీ! ఎంత వేగిరంగావచ్చి. నా నిరుపమను నాశనంచేసివేశావు !

తిష్య — ఆర్యపుత్రులు అవాభూషణులు మీకు కాలసర్పాలు అలంకారాలు కాలసర్పాలయినా, శివునిమెడలో ఉన్నా తమకు హానికలిగించే వారిని కాటువేయకమానవు

అశో — మహామృత్యువు నిన్ను పంపించింది హతవిధీ !

(చందమామ మబ్బువెనుకకు వెళ్ళిపోయాడు గాలి కదలిక మానుకుంది కోయిల నిద్దురపోయింది )

---

# బలి

అర్ధరాత్రిని అలికిడేదో !
ఏటిఒడ్డున ఎవ్వరోకడు
కష్టపడుచున్నట్టు చప్పుడు.
మేఘమున ఒకమెరుపు మెరిసెను
కేరమని పసిబిడ్డఏడ్చెను
తడిమిచూచెను కొడుకువా అనె
పాపముల పాపాయివా అనె
కాకియగు నీలోకమందున
మోయలేనీ ముద్దననుకొనె
డబ్బున్నవారికె దైవమనుకొనె
నీటిలో పడిపోయె నేదో—
కెవ్వుమని ఒకకేక వినబడె
మబ్బుచాటుకు చుక్కజారెను
అంతటా నిశ్శబ్దమేయిక
ఎవ్వరోహో ఈ అభాగ్యులు?
ఎందుకోహో ఇన్ని బాధలు?
సంఘమున ఈ జంతుబలులకు
చోటులేదని చాటుటెప్పటికో??

— మందరపు వెంకటేశ్వర శాస్త్రి.